క్లుప్తంగా

ముగిసిన భాగవత పారాయణం

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని మహంకాళీ ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న శ్రీదేవీ భాగవత్ పారాయణం బుధవారం ముగిసింది. వారం రోజుల పాటు పండరీపురానికి చెందిన సాధ్వీ ముక్తాశ్రీ దీదీ కథ పారాయణం చేశారు. సదానంద్ మహరాజ్ తన భక్తి పాటలతో అలరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

దుప్పట్లు పంపిణీ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అడ్డగుట్ట (కొలంగూడ)లోని ఆదివాసీ కొలాం గిరిజనులకు రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామస్తులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కొడప సోనేరావ్, కుమ్ర రాజు, తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జాగృతి నాయకులు

ఆదిలాబాద్: అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటుకు కృషి చేయాలని భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. సామాజిక సమానత్వానికి బాటలు వేసిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిబా పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు గోలి శంకర్, చిన్న సాయికృష్ణ, శ్రీపాదవార్ దీపక్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జలగం అనిత అన్నారు. బుధవారం కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. దాదాపు 250 మంది విద్యార్థులు మేళాలో పాల్గొన్నారు. ఐదు కంపెనీల హెచ్‌ఆర్‌లు హాజరయ్యారు. అర్హులైన పలువురిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్‌రావు, టీఎస్‌కేసీ మేంటర్ చైతన్య కృష్ణ, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ మానస్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కైలాస్‌నగర్: తెలంగాణ వ్యవసాయాధికారుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ రాహుల్ రాజ్ బుధవారం ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య, ఏడీఏ రమేశ్, సంఘ బాధ్యులతో కలిసి వాటిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ.అష్రఫ్, శివ కుమార్, కార్యవర్గ సభ్యులు రమేశ్, శ్రీనివాస రెడ్డి, సంధ్య, అరుణ పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ

బేల: మండలంలోని దుబ్బగూడ(ఎం) గ్రామంలోని కొడప భీంరావు, యశోదల పెద్ద కూమారుడు రాజేష్ కండరాల వ్యాధితో బాధపడుతూ.. మంచానికే పరిమితం కావడంతో ఆదిలాబాద్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి బుధవారం నిత్యావసర సరుకులు అందజేశారు.

మాతా శిశుమరణాల నియంత్రణకు కృషి చేయాలి

ఇచ్చోడ: మాతా శిశుమరణాలు నియంత్రణకు అంగన్‌వాడీలు ప్రత్యేక కృషి చేయాలని బోథ్ ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో అంగన్‌వాడీలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. చిన్నారులకు ప్రతిరోజు పౌష్టికాహారం అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

నేరడిగొండ: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అమృత్ కుమార్‌లు అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలు మహిళలు మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురవుతున్నారని, రక్షణ పొందేందుకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. చదువు, ఆహారం, క్రీడల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

'ఎనీమియా ముక్త్ తెలంగాణ' ప్రారంభం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల పాఠశాలలో బుధవారం ఎనీమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ప్రారంభించారు. ఇందులో చేపట్టాల్సిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంతెన పనులు ప్రారంభమెప్పుడో?

- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- ఇంకా పూర్తి కాని అగ్రిమెంట్
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



ఈఫొటోలో కనిపిస్తున్న వ్యక్తులు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చిట్యాల్‌బోరి గ్రామానికి చెందిన వారు. వారి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో కచికంటి గ్రామ సమీపంలో గల వాగుపై వంతెన లేకపోవడంతో ఇలా బైక్‌ను తీసుకెళ్తున్నారు. చిన్నపాటి కల్వర్టుపై నుంచి దాటుతున్న సమయంలో వాహనం అదుపు తప్పితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది.



చిట్యాల్‌బోరి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో వాగు

ఆదిలాబాద్‌రూరల్: అది మారుమూల గిరిజన గ్రామం కాదు. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న గిరిజన గ్రామం. ఆ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కచికంటి గ్రామ సమీపంలో గల వాగుపై వంతెన లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇది గ్రహించిన ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా వంతెన నిర్మాణం చేసేందుకు నిధులు మంజూరు చేసింది. రోడ్డు నిర్మాణంతో పాటు వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వాటి నిర్మాణ పనులను కాంట్రాక్టర్ దక్కించుకొని సుమారు మూడు నెలలవుతున్న నేటికీ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. సంబంధిత కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పనులకు సంబంధించి అగ్రిమెంట్ చేసుకోకపోవడంతో గమనార్హం. ఆయన నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో ప్రజలు వాగు దాటుతూ నానా అవస్థలు పడుతున్నారు.

రూ. 1.20 కోట్లు మంజూరు..

వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని సంబురపడుతున్న మండలంలోని చిట్యాల్‌బోరి గ్రామానికి చెందిన గిరిజనులు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. రోడ్డు, వంతెన లేకపోవడంతో వర్షకాలంలో నానా అవస్థలు పడుతున్నారు. అత్యవసర సమయంలో ప్రాణాలను అర చేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రూ. 1.20 కోట్లు మంజూరు చేసింది. వంతెన నిర్మాణంతో పాటు ఇరువైపులా 500 మీటర్ల చొప్పున బీటీ రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. అలాగే పంచాయతీ రాజ్ నిధులతో ఒక కిలో మీటర్ బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ. 84 లక్షలు అనాధికారికంగా మంజూరు చేశారు. నిర్మాణ పనుల్లో జాప్యం జరగడంతో అటు వైపు నుంచి వెళ్లే చిట్యాల్‌బోరి గ్రామస్తులు, కచికంటి గ్రామానికి చెందిన రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పనులు వెంటనే ప్రారంభించేలా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

అనేక ఏళ్ల నుంచి..



తమ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో వాగుపై వంతెన లేక ఇబ్బంది ఎదుర్కొంటున్నాం. కొన్నేళ్ల నుంచి వంతెన నిర్మాణం కోసం మంత్రులకు, ఎమ్మెల్యేలకు, అధికారులకు విన్నవించాం. అయితే ఇటీవల నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభంలో జాప్యం జరుగుతుంది.

– కుమ్ర వసంత్, గ్రామస్తుడు, చిట్యాల్‌బోరి

వెంటనే ప్రారంభించాలి



వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని సంతోషమే తప్ప ఇంకా పనులు ప్రారంభం కావడం లేదు. నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్ పనులను సైతం దక్కించుకున్నట్లు తెలిసింది. వంతెన లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– ఉయిక ఖమ్ము, గ్రామస్తుడు, చిట్యాల్‌బోరి

అగ్రిమెంట్ కావాల్సి ఉంది

కచికంటి గ్రామ సమీపంలోని వాగుపై వంతెన నిర్మాణం కోసం అసెంబ్లీ ఎన్నికల కంటే వారం, పది రోజుల ముందు నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ పనులను సైతం దక్కించుకున్నారు. పనులకు సంబంధించి అగ్రిమెంట్ కావాల్సి ఉంది. వారం రోజుల్లోగా అగ్రిమెంట్ చేసుకొని ప్రారంభిస్తాం.

– సుధాకర్, ఐటీడీఏ, ఏఈ

బీజేపీతోనే రైతు సంక్షేమం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



రైతును సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

జైనథ్: బీజేపీ సర్కార్‌తోనే రైతుల సంక్షేమం సాధ్యమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కాంటాకు పూజలు చేసి, రైతులను శాలువాతో సత్కరించి కొనుగోళ్లను ప్రారంభించారు. రైతులకు మద్దతు ధర అందేలా ఎప్పటికప్పుడు కేంద్రం చర్యలు తీసుకుంటుందన్నారు. ఆదిలాబాద్‌లో 50వేల క్వింటాళ్ల కందుల కొనుగోళ్లను లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటి సారిగా మార్కెట్‌కు వచ్చిన పాయల్ శంకర్‌ను మార్కెట్ కమిటీ కార్యదర్శి మధుకర్, పీఏసీఎస్ సీఈవో గంగన్న, అధికారులు ఘనంగా సన్మానించారు.

నాణ్యమైన కందులకు మద్దతు ధర

బేల: నాణ్యమైన కందులకు మద్దతు ధర లభిస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్ సౌజన్యంతో సహకార సంఘాల ఆధ్వర్యంలో కందుల కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటుకు దీటుగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో ప్రభుత్వ రంగ సంస్థతో కందులను క్వింటాలుకు రూ. 9,400 వరకు మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇంద్రశేఖర్, డోప్టాల సహకార సంఘం చైర్మన్ జితేందర్, కార్యదర్శులు తిరుపతి, ఠాక్రే ప్రఫుల్, బీజేపీ నాయకులు దత్తా నిక్కమ్, బోనిగిరివార్ గణేష్, రామెల్లి మోరేశ్వర్, బర్కాడే రాము, పోత్రాజ్ నవీన్ పాల్గొన్నారు.

'కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటాం'



నియామక పత్రం అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేసిన ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా వేముల నాగరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నిమ్మల గౌతమ్‌రెడ్డిలను నియమించారు. బుధవారం ప్రజాసేవభవన్‌లో వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న ప్రతీ కార్యకర్తకు రానున్న రోజుల్లో గుర్తింపు ఉంటుందన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు కార్యకర్తలంతా కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు కసరత్తు



పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా వర్షకాలంలో మొక్కలు నాటేందుకు ఇప్పటి నుంచే నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్నారు. మండలంలోని కచికంటి గ్రామంలోని నర్సరీలో మొక్కలను పెంచేందుకు గత కొన్ని రోజుల నుంచి బ్యాగ్ ఫిల్లింగ్, మట్టిని సిద్ధం చేస్తున్నారు. ఈ పనులను గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సోమన్నలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామంలోని నర్సరీలో 800 మొక్కలరు పెంచనున్నట్లు తెలిపారు. మల్లె, గన్నెర, గులాబీ, నిమ్మ, జామ, అల్ల నేరడి, బొప్పయి, చింత, ఖజ్జురా, ఓమ, కల్‌బంధ మొక్కలు పెంచుతామన్నారు. అటవీ ప్రాంతం నుంచి నల్ల, ఎర్ర మట్టితో మేకల ఎరువును ఉపయోగించడం జరుగుతుందన్నారు. ప్రజలకు కావాల్సిన అన్నిరకాల మొక్కలను పెంచుతున్నట్లు పేర్కొన్నారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ఎగ్జిబిట్లను తిలకిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఈనెల 19న జరిగిన సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం జిల్లా కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన పది ఎగ్జిబిట్లను సోషల్ మీడియా ద్వారా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు తిలకించేలా ఏర్పాటు చేశారు. నూతన ఆవిష్కరణలు తయారు చేసే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. నిత్య జీవితంలో సైన్స్ ప్రాముఖ్య ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్యామల దేవి, డీఈవో ప్రణీత, మిల్కా, సైన్స్ అధికారి రఘు రమణ, సెక్టోరియల్ అధికారులు ఉదయశ్రీ, నారాయణ, సుజాత్ ఖాన్, కేజీబీవీ ప్రత్యేకాధికారి దీప్తి, జలేందర్ రెడ్డి, స్వామి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఆదిలాబాద్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు చేరాల్సిన సంక్షేమ పథకాల ఫలాలను వారికి అందించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలకు ఉంటుందన్నారు. ప్రజలపై పక్షపాతం చూపించడం అనేది ఉండదన్నారు. ప్రజలను కన్న బిడ్డల్లా చూసుకునే నాయకుడే ప్రజల గుండెల్లో ఉంటాడన్నారు. కార్యక్రమంలో అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయండి

తలమడుగు: గ్రామ పంచాయతీలో నిర్వహించే అభివృద్ధి పనులకు 2024- 25 సంవత్సరానికి ప్రణాళిక తయారు చేయాలని ఎంపీపీ కల్యాణ లక్ష్మి రాజేశ్వర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో దీలిప్, అధికారులు పాల్గొన్నారు.

భూమిపూజ

తాంసి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించే రెడ్డి కా సంఘం, యాదవ సంఘం భవన నిర్మాణాలకు బుధవారం సర్పంచ్ కృష్ణ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, రాకేశ్, మహేందర్ రెడ్డి, సభ్యులు గంగారెడ్డి, రామన్న యాదవ్, రాజు, అభిలాష్ పాల్గొన్నారు.

108 వాహనం తనిఖీ

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలో 108 వాహనాన్ని జిల్లా మేనేజర్ తిరుపతి తనిఖీ చేశారు. వాహనాన్ని పరిశీలించి వాహన పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా తనిఖీ చేసినట్లు మేనేజర్ తెలిపారు. ఈఎంటీ కార్తీక్ సింగ్, పైలట్ అర్బాజ్ ఉన్నారు.

కొనసాగుతున్న సభ్యత్వ నమోదు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణ రజక సంఘం సభ్యత్వ నమోదు కొనసాగుతోంది. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని సంఘ భవనంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిబ్రవరి 5లోగా సభ్యత్వం నమోదు చేసుకోవాలని రజక సంఘం అడహక్ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో కొండ్రంటు రాజేశ్వర్, మైలరం శ్యాం, మల్కుల్‌వార్ సంతోష్, కొండురి స్వామి, బాపురావ్, జలరపు మధు, ఎల్చల శివదాస్, దేవిదాస్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గౌతమ్‌రెడ్డి

జైనథ్: యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జైనథ్ మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన నిమ్మల గౌతమ్‌రెడ్డి నియమితులయ్యారు. బుధవారం ఈ మేరకు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్ నియామక పత్రం అందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని గౌతమ్ రెడ్డి అన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఇచ్చోడ: వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. బుధవారం మండలంలోని దుబార్‌పేట్‌లో ప్రధానమంత్రి జన్‌మాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 553 మందికి సికిల్ సెల్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, ఏఎన్‌ఎంలు సుధారాణి, పద్మలు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల్లో ఎనిమియా ముక్త్‌భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి, రక్తహీనతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అరుణ్, ఏఎన్ఎం రోజా, పాఠశాల ప్రత్యేకాధికారి మల్లిక పాల్గొన్నారు.

ఈవీఎం హటావో.. దేశ్‌కో బచావో

- 31న కేంద్ర ఎన్నికల కమిషన్ ఎదుట ధర్నా
- బామ్ సేఫ్ జిల్లా అధ్యక్షుడు గణేశ్ మెకానే



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎదులాపురం: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఈవీఎంలను తొలగించాలని, బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని బామ్ సేఫ్ జిల్లా అధ్యక్షుడు గణేశ్ మెకానే డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఈవీఎం హటావో.. దేశ్ బచావో నినాదంతో ఈనెల 31న న్యూ ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషన్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ఎన్నికల సంఘం బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధం కావాలన్నారు. అంతకు ముందు ధర్నా కరపత్రాలు ఆవిష్కరించారు. ఇందులో బహుజన్ ముక్తి పార్టీ నాయకులు సయ్యద్ ఆరీఫ్, షేక్ షకీల్, వాసుదేవ్, గంగారాం, గోపి తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ విజయబాబు



మాట్లాడుతున్న సినీ నటుడు అభినవ్‌సర్దార్

ఇచ్చోడ: బాలికలు అన్నిరంగాల్లో రాణించాలని సినీ నటుడు, బీజేపీ నాయకుడు అభినవ్‌సర్దార్ అన్నారు. ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని గోల్డన్ లీఫ్ స్కూల్‌లో మాట్లాడారు. నేటి బాలికలే రేపటి దేశ భవిష్యత్‌కు నాంది కావాలని సూచించారు. ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీంరావు, గోల్డన్ లీఫ్ స్కూల్ కరస్పాండెంట్ రాథోడ్ అనిల్, మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

తాంసి: ప్రస్తుత పోటీ సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రొఫెసర్ విజయబాబు సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, ఎంఈవో శ్రీకాంత్, సఖీ కేంద్రం ఇన్‌చార్జి సరస్వతి, షీ టీం ఇన్‌చార్జి సుశీల, అరుణ, తులసీరాం, తదితరులు పాల్గొన్నారు.

భారతరత్న ప్రకటించడం అభినందనీయం



ఠాకూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడం అభినందనీయమని బీసీ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా కర్పూరి ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డు ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో సంఘం నాయకులు కలల శ్రీనివాస్, మందపెల్లి శ్రీనివాస్, జక్కేవార్ అంజయ్ కుమార్, సోమగారి వెంకటేశ్, మందపెల్లి నర్సయ్య, వేణు, శ్రీకాంత్, రాజు, రాములు, రాము పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ జయప్రదం చేయండి

నేరడిగొండ: తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28న స్థానిక ఆశ్రమ పాఠశాల్లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే టాలెంట్ టెస్ట్‌ను జయప్రదం చేయాలని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోవా సునీల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని బయట పెట్టేందుకు ఈటెస్ట్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బైరి సోమేష్, మాడవి మాణికరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో జీవాకర్ రెడ్డి

ఉట్నూర్‌రూరల్: 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో జీవాకర్ రెడ్డి కోరారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో అన్ని రాజకీయా పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. బీఎల్‌వో, వీటీడీఏ ద్వారా ఓటరు మార్పులు, చేర్పులు చేసేలా చూడాలని సూచించారు. బూత్ ఏజెంట్లు సహకరించి ఎవరికైతే ఓటుహక్కు లేదో వారికి ఓటు నమోదు వివరించాలన్నారు. సమావేశంలో డీటీ భుజంగ్‌రావు, ధరణి రాజేశ్, ముజీబ్ ఖాన్, రామగిరి వాసు, వెంకటి, అబ్దుల్ ఖయ్యుం, ఇమ్రాన్ పాల్గొన్నారు.

సమాచారం

రేపటి నుంచి క్రికెట్ పోటీలు

తలమడుగు: మండలంలోని దేవాపూర్ గ్రామంలో ఈనెల 26 నుంచి ఎమ్మెల్యే అనిల్ అన్న యువసైన్యం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు యువజన సంఘం నాయకులు తెలిపారు. మొదటి బహుమతి రూ. 25,000, రెండో బహుమతి రూ. 15,000 అందించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ. 1200 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

రేపు పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గంగన్నపేట గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయ 20వ వార్షికోత్సవాన్ని 26న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు కొత్తపెల్లి మహేందర్ తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

తలమడుగు: మండలంలోని పల్సి(బి)తండా గ్రామానికి గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రానున్నట్లు నారాయణ బాబా ఆలయ నిర్వాహకులు కిషన్ మహరాజ్ తెలిపారు. గ్రామంలో నారాయణ బాబా ఆలయ అఖండ జ్యోతి, యజ్ఞ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. విజయవంతం చేయాలని కోరారు.